ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ శుక్రవారం । 4 ఏప్రిల్ 2025 । ■ 09 పేజీలు



09

## రాజ్యాంగ రక్షణకు పాటుపడాలి



7

# అకాల వర్షంతో అన్నదాత విలవిల

## మబ్బులతో రైతుల్లో టెన్షన్.. టెన్షన్..

■ అకాల వర్షంతో తడిసిన ధాన్యం
■ కల్లాల్లో కొట్టుకుపోయిన మొక్కజొన్న
■ ఈదురుగాలులకు నేలరాలిన మామిడి
■ విరిగిపడిన చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాలు, ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
■ కరెంటు సరఫరాకు అంతరాయం
■ కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో కుంభవృష్టి..
■ గాలివానకు ఉమ్మడి జిల్లా ఆగమాగం..

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గురువారం మధ్యాహ్నం నుంచి ఉరుములతో, మెరుపులతో భారీగా వర్షం ఎడతెరిపి ఇవ్వకుండా దంచికొట్టింది.. భారీ వర్షం కారణంగా ప్రజలు ఉక్కపోత నుంచి ఊరట పొందుతున్నప్పటికీ.. అకాల వర్షంతో రైతన్నలు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతీ ఏటా అన్నదాతలను అకాల వర్షాలు కలవరపెడుతున్నాయి. వడగండ్లకు తోడు ఈదురు గాలులు వీస్తుండడంతో వరి, మామిడి, సోయ, పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలో కోత దశలో ఉన్న పంటలను అకాల వర్షాలు దెబ్బతీశాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కుంభవృష్టిగా కురిసింది. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాలలో ఓ మోస్తారు వర్షం కురిసింది. భూ ఉపరితలం వేడెక్కడం, ద్రోణి ప్రభావంతో క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడి వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటన చేసింది. మరో మూడు నుంచి నాలుగు రోజులపాటు వర్షాలు కొనసాగుతాయని వాతా వరణ కేంద్రం తెలిపింది.

## మామిడి రైతు.. ఆగమాగం

అకాల వర్షం పండ్ల తోటలపై తీవ్ర ప్రభావం చూపింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాలలో అధికంగా సాగవుతున్న మామిడి తోటలపై ఈదురుగాలులల ప్రభావం పడింది. మామిడికాయలు నేలరాలాయి. సాధారణంగా మే నెలలో మామిడి కాయలకు మంచి ధర వస్తుందన్న రైతులు ఈదురుగాలలు, గాలి దూమారానికి చేతికి వచ్చిన పంట నేలరాలి తీవ్రంగా నష్టపోయామని మామిడి రైతులు చెబుతున్నారు. పెట్టిన పెట్టుబడి దక్కేలా లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.







2

## అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్‌పై ఏసీబీ దాడులు

■ రాత్రి వేళ ఏసీబీ అధికారుల ఆకస్మిక దాడులు ■ ఒక్కసారిగా నిర్మానుషంగా సరిహద్దు ప్రాంతం
■ చెక్‌పోస్ట్ అధికారులను విచారిస్తున్న ఏసీబీ ■ ప్రైవేట్ వ్యక్తుల వద్ద నగదు లభ్యం ■ రూ.45 వేలు స్వాధీనం

జిల్లాలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో రాష్ట్ర రవాణా శాఖ చెక్ పోస్ట్ వద్ద ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించడంతో సంచలనం రేగింది. బుధవారం రాత్రి ఏసీబీ అధికారులు చెక్‌పోస్ట్ వద్ద నిఘా పెట్టి మహారాష్ట్ర -తెలంగాణ సరిహద్దు మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్న వాహనాల నుండి ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రవాణా శాఖకు సంబంధం లేని ఇద్దరు వ్యక్తులు వాహనాల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద రూ.45100 నగదును స్వాధీన పరచుకున్నట్లు కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. విధుల్లో ఏఎంవీఐ మాధవి ఉన్నట్లు ఆయన తెలిపారు. అక్రమ వసూళ్లపై మాధవిలతను విచారిస్తున్నారు. డబ్బులు వసూలు చేస్తున్నా ఐలయ్య, విజయ్ కుమార్‌లను పట్టుకున్నారు.

## ఎన్టీపీసీకి రూ.100 కోట్ల జరిమానా

2లో

■ ఎన్టీపీసీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని నోటీసులు జారీ చేసిన నగరపాలక సంస్థ కమిషనర్..
■ నిబంధనలు పాటించాల్సిందే ■ అదనపు కలెక్టర్



## అసాంఘిక కార్యకలాపాలను అరికడతాం

■ గంజాయి, మాదకద్రవ్యాలను అరికట్టేందుకు గంజాయి స్మగర్లపై నిరంతరం నిఘా
■ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

■ కేంద్ర మంత్రులను కలిసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు
■ జాతీయ రహదారులను అభివృద్ధి చేయండి
■ బాసర-మాహుర్ రహదారికి నిధుల్వివండి
■ బాసర బ్రిడ్జిపై కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
■ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీకి విన్నవించిన బీజేపీ నేతలు
■ ఆదిలాబాద్‌లో విమానాశ్రయానికి భారత వైమానిక దళం నుంచి అనుమతులు ఇప్పించినందుకు గాను పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ, ఎమ్మెల్యేలు

వివరాలు 9లో





# ఎన్టీపీసీకి రూ.100 కోట్ల జరిమానా

**ఎన్టీపీసీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ నోటీసులు జారీ**

**మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ భారత ప్రభుత్వ రంగ సంస్థ రామగుండం ఎన్టీపీసీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతుందని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సుమారు రూ. 100 కోట్ల జరిమనా విధించారు. ఎన్టీపీసీ యాజమాన్యం అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని, దాంతో చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులో రామగుండం కమిషనర్ హెచ్చరించారు. ఎన్టీపీసీ నూతనంగా ఆరు రకాల నిర్మాణాలను చేపట్టింది. టైపు బి నిర్మాణానికి రూ. 39, 61,90,154 కోట్లు, హెచ్ఓడీ బిల్డింగ్‌కు రూ.18,55, 70,351 కోట్లు, టైప్ డి నిర్మాణానికి రూ.27, 29,72, 955 కోట్లు, గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ. 6,61,64,044 కోట్లు, ఏసీ రెస్టారెంట్ బిల్డింగ్ నిర్మాణానికి రూ. 2,35, 63,705 కోట్లు, కమ్యూనిటీ సెంటర్ బిల్డింగ్ నిర్మాణానికి రూ. 4,83,62,341 కోట్లు కలిపి మొత్తం రూ. 99,28, 29,548 కోట్లను విధించారు. ఎన్టీపీసీ సంస్థ నిర్మిస్తున్న నిర్మాణాలకు కావలసిన అనుమతులు తీసుకోవాలని రామగుండం మున్సిపల్ అధికారులు రెండు నెలల క్రితం నోటీసులు పంపినా యాజమాన్యం స్పందించలేదని తెలిపారు. దీంతో ప్రత్యేక అధికారి కమిషనర్ (ఎఫ్ఎసి) అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ నోటీసులు పంపినా యాజమాన్యం స్పందించకపోవడంతో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని రూ. 100 కోట్ల పెనాల్టీ విధించారు. ప్రత్యేక అధికారి నూతన ఆలోచనలతో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ను అభివృద్ధి బాటలో నడిపించేందుకు తనదైన శైలిలో నిర్ణయాలు తీసుకొని అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు.

**ఎవరైనా నిబంధనలు పాటించాల్సిందే**

**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణ శ్రీ**

ప్రభుత్వ నియమాలను సంస్థలైనా, వ్యక్తులైనా పాటించాల్సిందే. మేము ఎన్టీపీసీ యాజమాన్యానికి నిర్మాణాలకు పర్మిషన్లు తీసుకోవాలని నోటీసులు పంపినా వారు స్పందించలేదు. దీంతో సుమారు రూ.100 కోట్ల పెనాల్టీ విధించాం. కలెక్టర్ నిర్ణయం మేరకు తగిన చర్యలు తీసుకోవడానికి వెనకాడం. ఇప్పటికైనా యాజమాన్యం కార్పొరేషన్ అధికారులకు సహకరించి కావలసిన అనుమతులు పొందాలి.

## ఆ వ్యాపారి ఇంట్లో
# అక్రమ మద్యం నిల్వలు
### చర్యలకు అధికారుల వెనుకడుగు

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ పట్టణంలోని డాడా నగర్‌లో ప్రముఖ వ్యాపారి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన కల్తీ మద్యం ఆటోలో తరలిస్తున్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. అయినప్పటికీ, అధికారుల చర్యలు తీసుకోకపోవడం పట్ల పలువురు బహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే ఈ అక్రమ మద్యం వ్యాపారానికి మాజీ సిండికేట్ నేత హస్తం ఉందని, అతను తన బలంతో వైన్ షాప్‌లపై రైడ్లు చేయించుతూ ప్రత్యర్థులను ఇబ్బందులు పెడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. గతంలో బట్టుపల్లిలో జరిగిన అక్రమ మద్యం కేసులోనూ అతని పాత్ర ఉందని ప్రచారం జరిగింది. అధికారుల నిర్లక్ష్యంతో కల్తీ మద్యం రవాణా పట్టపగటే జరుగుతున్నా, అధికారుల నిఘా లేకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మద్యం మిక్సింగ్ జరుగుతోందన్న సమాచారం ఉన్నప్పటికీ, ఇందుకు బాధ్యులపై ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలి ప్రజలు ఈ కల్తీ మద్యం ముఠాలను వెంటనే అరికట్టాలని, ఆరోగ్యానికి హాని కలిగించే మద్యం విక్రయాలను నిలిపివేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే స్థావరాల పై దాడులు జరిపి, ఈ అక్రమ రవాణాకు బాసటగా ఉన్న వారిని శిక్షించాలని ప్రజాసంఘాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి.

# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు కొమురయ్య

**కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకం - నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ - నివాళులర్పించిన అదనపు కలెక్టర్, సిబ్బంది**

**మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**



నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవాలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్, జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, కుల సంఘాల నాయకులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని తెలిపారు. దేశ స్వాతంత్రం, ప్రజల సంక్షేమం కోసం వీరోచితంగా పోరాడి, ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. నేటి యువత ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, కుల సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్ మండల కేంద్రంలోని వేణునగర్‌కు చెందిన ఆర్.పి లత కుటుంబ సభ్యులకు ఉట్నూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ రూ. 27వేలు విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ పథకం వల్ల ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో మేలు చేకూరుతుందన్నారు.



# అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్‌పై ఏసీబీ దాడులు

**రాత్రిపూట రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు - అక్రమ వసూళ్లకు అడ్డగా మారిన సరిహద్దు చెక్ పోస్ట్...!**

**ఏసీబీ ఆకస్మిక దాడులు - నిర్మానుషంగా మారిన సరిహద్దు ప్రాంతం**

**అధికారులను విచారిస్తున్న ఏసీబీ - ప్రైవేట్ వ్యక్తుల వద్ద నగదు లభ్యం**

**వాంకిడి వద్ద రూ.45,100 నగదు లభ్యం నగదు**




**ఆసిఫాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్‌లో బుధవారం రాత్రి ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాలకు నిత్యం వేలాది వాహనాల నుండి రవాణా శాఖ అధికారులు చేతివాటానికి పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు వాంకిడి చెక్ పోస్ట్‌పై ఆకస్మికంగా దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఏఎంవీఐ అధికారిని మాధవిని విచారణ జరిపి లెక్కకు మించిన నగదు రూ.45 వేలను సీజ్ చేసినట్లు సమాచారం. ఒక్కసారిగా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించడంతో చెక్ పోస్ట్ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. జిల్లాలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో రాష్ట్ర రవాణా శాఖ చెక్‌పోస్ట్ వద్ద ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించడంతో సంచలనం రేగింది. బుధవారం రాత్రి ఏసీబీ అధికారులు చెక్‌పోస్ట్ వద్ద నిఘా పెట్టి మహారాష్ట్ర -తెలంగాణ సరిహద్దు మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్న వాహనాల నుండి ఆర్టీఏ చెక్ పోస్ట్ వద్ద ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రవాణా శాఖకు సంబంధం లేని ఇద్దరు వ్యక్తులు వాహనాల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద రూ:45100 నగదును స్వాధీన పరచుకున్నట్లు కరీంనగర్ ఏసీబీ డి.ఎస్.పి రమణమూర్తి తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద ఆకస్మికంగా తనిఖీలు చేపడుతుండగా విధుల్లో ఏఎంవీఐ మాధవి ఉన్నట్లు ఆయన తెలిపారు. అక్రమ వసూళ్లపై ఏసీబీ అధికారులు మాధవి లతను విచారిస్తున్నారు. వాహనాల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు ఐలయ్య ఆలియాస్ రవి, విజయ్ కుమార్‌లను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రవాణా శాఖ చెక్‌పోస్టుల్లో ఏసీబీ అధికారుల తనిఖీలు కలకలం రేపుతున్నాయి. బుధవారం రాత్రి జరిపిన సోదాల్లో వాంకిడి చెకోపోస్టులో రూ.45,100 పట్టుబడ్డాయి. రాత్రి 11.45 గంటల నుంచి తెల్లవారు జామున 3గంటల వరకు తనిఖీలు కొనసాగాయి. ఆదిలాబాద్, కరీంనగర్ డీఎస్పీలు విజయ్కుమార్, రమణమార్తి, మరో నలుగురు సీఐలు ఏకకాలంలో అక్కడి రికార్డులు పరిశీలించారు. రెండు ఫోన్లు సీజ్ చేశారు. ఆ సమయంలో డ్యూటీలో ఏఎంవీ మాత్రమే ఉండగా, ఇంకా ప్రైవేటు వ్యక్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇదే తరహాలో గతేడాది మేలో భోరజ్ చెకోపోస్టు వద్ద రూ. 11,630, గత డిసెంబర్ 4న రూ.62,500 నగదు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాయి.



## లబ్ధిదారులందరికీ సన్న బియ్యం

**మందమర్రి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
మండలంలోని రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందించడం జరుగుతుందని సన్న బియ్యం పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ రాజేశ్వర్‌లు కోరారు. మండలంలోని చిర్రకుంట గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సన్నబియ్యం అందించే లక్ష్యంతో ప్రారంభించిన సన్న బియ్యంను మండలంలోని లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు అమలు చేస్తున్న సన్నబియ్యం పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం గంది రామచందర్ మాజీ సర్పంచ్ ఒడ్నాల కొమురయ్యల ఆద్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి గార్ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజయ్య, సుధాకర్, సంపత్ రావు, అత్తిపోశయ్య పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య జయంతి

**బెజ్జూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
బెజ్జూరు మండల కేంద్రంలో గురువారం దొడ్డి కొమురయ్య జయంతిని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉమ్మెర బాలకృష్ణ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం రావడానికి భూమి భుక్తి విముక్తి ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వం ప్రధాన కారణం ఏడవ నిజాం రాజు మీరు ఉస్మాన్ ఖాన్ కాలంలో తెలంగాణ ప్రజలు దుర్భారమైన పరిస్థితిని ఎదుర్కొన్నారని అన్నారు. నిజాం అండదండతో గ్రామాల్లో జాగిర్దారులు భూస్వాములు దేశముఖదేశ్ పాండేలు దొరల పెంటంగిపోయి ప్రజలను విపరీతంగా పిడించేవారని, అలాంటి వారిలో ఒకరు విస్నూర్ దేశముఖ్ రామచంద్ర రెడ్డి అతని ఆగడాలకు హద్దు పద్దు లేదని భువనగిరిలో 1944 ఆంధ్ర మహాసభ సంఘం సమావేశం చైతన్యంతో కడివెండిలో గ్రామ సంఘం ఏర్పడిందన్నారు. ఊరి జనమంతా ఒక ఆయన చెల్లించి సంఘంలో జేరే గ్రామ రక్షణ దళంగా ఏర్పడి ఎదురు తిరిగారని సంఘం అండతో దొరసాని జానమ్మ కు పన్ను కట్టడం మానేశారు. పన్ను చెల్లించని వారి పైన ముఖ్యంగా జానమ్మకి ఎదురు తిరిగిన దొడ్డి మల్లయ్య కుటుంబం పై ఒత్తి విరగగా తన సోదరుడికి కొమురయ్య కూడా అండగ నిలబడ్డాడనిఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు కుమ్మరి తిరుపతి ,యాదవ సంఘం మండల అధ్యక్షుల ఎర్రయ్య, ఎస్టి మోర్చా అధ్యక్షులు మేస్త్రం రాజారాం ,మాజీ సర్పంచ్ గూడ రాకేష్ ,మెరుగు గంగ, మెరుగు శ్రీనివాస్, కిషన్ గోపాల్ ,డోకే మహేష్ ,శ్రావణ్ గౌడ్ ,చిప్పకుర్తి వెంకటి, పేదం తులసిరామ్ ,సామల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.




# జై బాపు.. జై భీమ్.. జై సంవిదాన్ యాత్రలో కాంగ్రెస్ నాయకులు




**లక్షెట్టిపేట, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
ఏఐసీసీ పిలుపు మేరకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖల ఆదేశాల మేరకు గురువారం మున్సిపాలిటీ లోని పలు వార్డులలో జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ పాదయాత్రకు ముఖ్యఅతిథిగా టీపీసీసీ జెనరల్ సెక్రటరీ చిట్ల సత్యనారాయణ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా చీట్ల సత్యనారాయణ మాట్లాడుతూ... నేడు లక్షెట్టిపేటలో రెండో రోజు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ను నిర్వహిస్తున్నామన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు గాంధీ చూపిన బాటలో నడుస్తూ భారతదేశాన్ని, మన రాజ్యాంగాన్ని కాపాడుకుందామని అన్నారు. ఇటీవల బీజేపీ పార్టీ పరిణామాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ సమాజంలో అశాంతిని నెలకొల్పుతున్నాయి అని అన్నారు. మహాత్మాగాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్ ల యొక్క ఆశయాలను లక్షెట్టిపేట మున్సిపాలిటీ వార్డులలో వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్నా అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల నియోజకవర్గంకు ప్రభుత్వ నుంచి నిధులు తీసుకవస్తు అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మాజీ ఎంపీటీసీ మడిపెల్లి స్వామి, యూత్ అధ్యక్షులు చిన్న వెంకటేష్, మాజీ కౌన్సలర్ సురేష్ నాయక్,రాందేని వెంకటేష్, వెంకటస్వామి, రాజన్న అమీర్ పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేషన్ దినోత్సవ వేడుకలు



**మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల పట్టణంలోని శ్రీ చైతన్య లక్ష్మీనగర్ బ్రాంచ్ స్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో యుకేజి పూర్తి చేసి ఒకటవ తరగతిలోకి, ఐదవ తరగతి పూర్తి చేసి ఆరవ తరగతిలో అడుగు పెట్టే విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అయూబ్ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఈ వేడుకలు చేస్తున్నామని అన్నారు. శ్రీ చైతన్య పాఠశాలల ఛైర్మన్, డైరెక్టర్లు మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అరవింద్ రెడ్డి, ప్రిన్సిపాల్ అయూబ్, కో - ఆర్డినేటర్లు జయశ్రీ, రోజా రాణి, ఇంచార్జిలు అనగమాత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని రాంనగర్‌లో ఉన్న భగవద్గీత అధ్యాయన మండలి ప్రాంగణంలో మంచిర్యాల లయన్స్ క్లబ్, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ సంయుక్తంగా గురువారం ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 180 మందికి రేకుర్తి ఐ హాస్పిటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించగా ఇందులో 75 మంది కంటి శాస్త్ర చికిత్సలకు అర్హత కలిగి ఉన్నట్టు గుర్తించారు. వీరిలో మొదటి విడతగా 54 మందిని లయన్స్ రేకుర్తి ఐ హాస్పిటల్‌కు ఉచిత బస్సు, వసతి, ఉచిత భోజన దుపాయాన్ని సమకూరుస్తూ కంటి శాస్త్ర చికిత్సలకు పంపించి, శనివారం ఆపరేషన్లు నిర్వహించి డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని లైన్స్ డిస్ట్రిక్ట్ విజన్ సెక్రటరీ లయన్ డాక్టర్ కే సుగుణాకర్ రెడ్డి తెలిపారు.




## రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలి



**మందమర్రి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
సింగరేణి కార్మికులు అధికారులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ పిపి వెంకటేశ్వర్లు, కార్పొరేట్ జిఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్ లు కోరారు. రక్షణ చర్యలపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో వారు మాట్లాడారు. ఎలక్ట్రికల్/మెకానికల్/డిపార్ట్మెంట్‌లు గనులకు సంబంధించి తీసుకోవలసిన రక్షణ చర్యలపై సేఫ్టీ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గనుల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలు వివరించారు. ఎల్లప్పుడు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించడానికి ప్రతి ఒక్కరు సమిష్టి కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ జి.ఎం కే రఘుకుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, అన్ని గనుల సేఫ్టీ ఆఫీసర్లు, డిపార్ట్మెంట్ల ఇంజనీర్లు, పిట్ ఇంజనీర్లు, ఏరియా స్టోర్, ఏరియా వర్క్ షాప్, 132 కే.వీ, రామకృష్ణాపూర్, సిహెచ్పి సబ్ స్టేషన్ హెచ్ఓడిలు, పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

## మండల విద్యాధికారి దత్తు మూర్తి

**మందమర్రి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తద్వారా పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని మండల విద్యాధికారి కే దత్తు మూర్తి కోరారు. మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గురువారం జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏది లేదని విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ మాట్లాడుతూ... పట్టణంలోని ఆదర్శ పాఠశాల జిల్లాలోనే అత్యుత్తమ ఫలితాలు సాదిస్తు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఉపాధ్యాయుల ఉత్తమ విద్య బోధనతో ఇంటర్మీడియట్ 10వ తరగతిలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉన్నత ఫలితాలు సాధించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు బోధన, తల్లితండ్రుల ప్రోత్సాహంతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. పాఠశాల విద్యార్థులు క్రీడలు ఇతర రంగాలలో రాణిస్తున్నారని విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దిన కోచ్ లు, పిఈటి లను ప్రత్యేకంగా అభినందించారు. 2023-24 సంవత్సరంలో ఎస్ఎస్సి ఫలితాలలో ముగ్గురు 10/10 జిపిఏ, 38 మంది విద్యార్థులు 9 జిపిఏతో 100 శాతం ఉత్తీర్ణత సాధించామని, 2024-25 లో 60 శాతానికి పైగా 9 జిపిఏ సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ పి శ్రీనివాస్, ఏఎస్ఓ రాజ్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## వాటర్ షెడ్ యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే

**బెల్లంపల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
కాసిపేట మండలంలోని దేవాపూర్ గ్రామపంచాయతీలో వాటర్ షెడ్ యాత్రను గురువారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ భాగంగా దేవాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. వాతావరణ సమతుల్యత నీటి సంరక్షణ మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణ కూడా ఎంతో కీలకమని మొక్కలు నాటడం ద్వారా వాతావరణ సమతుల్యత సాధించవచ్చునని చెప్పారు. మొక్కలు నాటడం ద్వారా వాతావరణ సమతుల్యత సాధించవచ్చున్నారు.





## ఆదిలాబాద్ కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ డిపో మేనేజర్

ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
ఇటీవల ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి. ప్రతిమారెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందజేసి కలెక్టర్‌ను ఆమె పరిచయం చేసుకున్నారు. ఈ మేరకు పలు అంశాలపై వారు చర్చించారు. ఆర్టీసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రయాణికులకు బస్టాండ్‌లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు.

## యూత్ కాంగ్రెస్ కార్యనిర్వాహక సమావేశం



ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యనిర్వాహక సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల అధ్యక్షతన ఘనంగా గురువారం మావల మండలంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మధుకర్ యాదవ్, అల్మాస్ ఖాన్‌లు హాజరై పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ యువతకు పెద్దపీట వేస్తుందని వారు పేర్కొన్నారు. పార్టీలో చురుగ్గా పాల్గొనే ప్రతి యువకుడికి అనేక అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

## మార్కెట్ యార్డులో సమస్యలు పరిష్కరించండి



ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
వ్యవసాయ మార్కెట్ యార్డులో గల సమస్యలు, హమాలీల సమస్యల అతిత్వరలో పరిష్కరించాలని మార్కెట్ కమిటీ ఛైర్మన్లు జిక్కు కలెక్టర్ రాజర్షిషాను కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ ను వారు కలిశారు. జొన్న కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఆయనను సన్మానించారు. బోథ్, జైనథ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీల ఛైర్మన్లు గంగారెడ్డి, అశోక్ రెడ్డి, ఉత్తం ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇచ్చోడ, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
ఇచ్చోడ మండలంలోని సాత్ నెంబర్ గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం ముక్రా గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తు లకు రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. మనోజ్, కొండిబాలు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి.

# పెన్షన్ ఫండ్‌కు యజమాన్యాలు మరో 10/- ఇచ్చేందుకు అంగీకారం

సిఐటియు వేజ్ బోర్డు సభ్యులు మంద నరసింహా రావు



మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
ఏప్రిల్ 1, 2025న పెన్షన్ నిధికి టన్నుకు మరో రూ.10 చొప్పున బొగ్గు సంస్థల యాజమాన్యాలు అదనంగా ఇచ్చేందుకు అంగీకరించాయని సిఐటియు వేజ్ బోర్డు సభ్యులు సభ్యులు మంద నరసింహారావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిఐటియు, ఏఐటియుసి, హెచ్ఎంఎస్, యూనియన్‌ల ఒత్తిడి మేరకు పది రూపాయలు అదనంగా ఇచ్చేందుకు అంగీకరించాయన్నారు. పెన్షన్ ఫండ్ పెంచాలని చాలా కాలంగా పెన్షన్ నిధి స్థిరత్వం గురించి జాతీయ కార్మిక సంఘాలు ఆందోళనలు చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. ఫిబ్రవరి 2024లో జరిగిన సమావేశంలో చేసిన తీర్మానం మేరకు జూన్ 2024లో బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి అధ్యక్షతన కమిటీ ఏర్పడిందని, దీనిలో యూనియన్ల తరపున సిఐటియు సభ్యుడు డిడి రామానందన్‌ను నియమించామని తెలిపారు. కమిటీ మొదటి సమావేశం జూలై 2024లో జరుగగా ఈ సమావేశంలో యాజమాన్యం తరపున ఆచారి, సిఎంపిఎఫ్ పిపిటి ద్వారా ఇచ్చిన ప్రజెంటేషన్ లో పెన్షన్ తగ్గించాలని ప్రతిపాదించగా దీనిని డిడి రామానందన్ తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. దీనిపై భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, యూనియన్ నాయకులందరినీ ఇందులో చేర్చాలని డిమాండ్ చేయడంతో ఏకాభిప్రాయం కుదిరిందని అన్నారు. కమిటీ సమావేశంలో ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సిఐటియు ప్రతినిధులు స్పష్టంగా "పెన్షన్ ఇవ్వడం యజమాని బాధ్యత" అని పట్టుబట్టడంతో పెన్షన్ ఫండ్ కు 10 రూపాయలు అదనంగా ఇచ్చేందుకు ఏకాభిప్రాయం కుదిరిందన్నారు. అదనంగా ఇచ్చే పది రూపాయలు ఏప్రిల్ 16 2025 నుండి అమలులోకి వస్తుందన్నారు. సిఐఎల్ డైరెక్టర్ పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు పద్ధతి మార్చుకోవాలి



కోటపల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో చెన్నూర్ రూరల్ సర్కిల్ పరిధిలోని కోటపల్లి, నీల్వాయి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెదిలి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనకూడదని సూచించారు. గ్రామాల్లో జరిగే ప్రతి విషయాన్ని పోలీస్‌లకు తెలియజేయాలని పేర్కొన్నారు. చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలలో పాల్గొనకూడదని ఎటువంటి కేసుల్లోనైనా పాల్గొంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి, నీల్వాయి ఎస్సైలు రాజేందర్, శ్యామ్ పటేల్ పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి




### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మిట్టపల్లి గ్రామంలో వాటర్ షెడ్ యాత్రను ప్రారంభిం చారు. నీటి సంరక్షణ ప్రాధాన్యతపై గ్రామంలో విద్యార్థులు, అధికారు లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత నీటి సంరక్షణ మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణ కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ద్వారా వాతావరణ సమతుల్యత సాధించవచ్చన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యం, పాఠశాల పరిసరాలను హరితమయంగా మార్చడం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. నీటి సంరక్షణ, ప్రాథమిక భూసారం పెం పొందించి వ్యవసాయాన్ని మెరుగు పరిచే లక్ష్యంగా వాటర్ షెడ్ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్ర మంలో డీఆర్‌డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో గణ పతి, మండల తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీ వో శ్రీపతి బాపురావు, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో బాలయ్య, మహిళ సంఘాల సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నస్పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించి, క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, తాము చేసే పనిలో చురుకుదనం పెరుగుతుందని అన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణతో ఆటలు కొనసాగిస్తూ తమ తమ జట్లు గెలుపు కోసం పాటుపడాలని కోరారు. టోర్నీలో పాల్గొంటున్న ఇరు జట్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్ రావు, మాజీ కౌన్సిలర్ సీపతి సుమతిమల్లేష్, నాయకులు సంపత్ రెడ్డి, ఇరికిల్ల పురుషోత్తం, కొమురయ్య, రాజం, మున్సిపల్ బిల్ కలెక్టర్ సురేష్ కుమార్, ఆర్గనైజింగ్ సభ్యులు లవ, ఫారూక్, రమేష్ పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన ఉమ్మడి జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు



ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
ఆదిలాబాద్ జిల్లాలో ప్రతిపాదిత పౌర విమానాశ్రయానికి భారత వైమానిక దళం ఆమోదం తెలపడం పట్ల ఎంపీ నగేష్, బీజేపి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుని గురువారం కలిసి ఘనంగా సత్కరించారు. వీలైనంత త్వరగా ఆదిలాబాద్ విమానాశ్రయం అభివృద్ధి చేసి పౌర విమాన సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వాయుసేన శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

## రక్తదాన శిబిరం విజయవంతం



కడెం, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
కడెం మండలం లింగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కుర్ర గంగాధర్ తల్లి కుర్ర లచవ్వ జ్ఞాపకార్థం ఫౌండేషన్ ఏర్పాటు చేసి రక్తదానాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 40 మంది యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. నిర్మల్ ఏరియా ఆసుపత్రికి చెందిన సిబ్బంది ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించగా, రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం చారిత్రాత్మక పథకం

నెన్నెల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీష్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని చిత్తాపూర్, ఆవడం గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.





# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

## సుర్జాపూర్ గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలపై వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి అవగాహన ర్యాలీ

**బెల్లంపల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని తాండూర్ సీఐ కుమారస్వామి హెచ్చరించారు. గురువారం కన్నెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుర్జాపూర్ గ్రామంలో నకిలీ పత్తి విత్తనాల పై వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన అవగాహన ర్యాలీ నిర్వహించారు. నకిలీ పత్తి విత్తనాలు వాడడం వల్ల భూమి సారవంతం కోల్పోయి పంట దిగులు తగ్గుతుందని తెలిపారు. కౌలు రైతులకు కూడా ఈ నకిలీ విత్తనాలను వాడడం వల్ల భూతారం దెబ్బతింటుందని చెప్పారు. నకిలీ విత్తనాలు వాడడం వల్ల పంట నష్టపోతే ప్రభుత్వం నుండి ఎలాంటి పరిహారం అందదని తెలిపారు. గ్లైపోసిట్ నకిలీ విత్తనాలు వాడడం వల్ల చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని సూచించారు. ర్యాలీలో కన్నెపల్లి ఎస్సై గంగారం తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏఓ



భీమారం మండల కేంద్రంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో రైతులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే రసీదు తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. రైతులకు ఈ-పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని డీలర్లకు సూచించారు. అదే విధవగా ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి అత్తే సుధాకర్ హెచ్చరించారు. ఎరువులను ఎమ్మార్పీకే అమ్మాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే శాఖపరమైన కఠిన చర్యలు తప్పవని అన్నారు.

## ఉపాధి అవకాశం కల్పించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో కూలీలుగా తమకు అవకాశం కల్పించాలని ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వాన్ని కోరారు. మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు కావడంతో జనకాపూర్, ఆసిఫాబాద్ గొడవల్లి, తారకరామ నగర్ బజార్ వడి తదితర ప్రాంతాలకు చెందిన ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కరువైంది. ఈ ప్రాంతాల కూలీలకు రాజంపేట గ్రామపంచాయతీ యందు జాబ్ కార్డులను విలీనం చేసి పనులు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ ఏర్పాటుతో పేద ప్రజలైన తమకు అన్యాయం జరిగిందని అధికారులు మానవతా దృక్పథంతో తమకు న్యాయం చేయాలని కోరారు. తమకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈనెల 4న రాస్తారోకో, 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఉపాధి హామీ కూలీల సంఘం అధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి పావని తెలిపారు. ఉపాధ్యక్షురాలు స్వరూప, కోశాధి కారి మంజుల, సహాయ కార్యదర్శి సుగుణ పాల్గొన్నారు.



## ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



**గుడిహత్నూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గురుజ గ్రామానికి చెందిన ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గురుజ గ్రామానికి చెందిన నైతం కరుణ (23)కు ఆదిలాబాద్ రూరల్ మండలం లోకారి గ్రామం చెందిన నైతం లక్ష్మణ్‌తో రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కరుణ వారం రోజుల క్రితం తల్లిగారి గ్రామమైన గురుజకు వచ్చింది. గత కొన్ని రోజులుగా ఆమె మానసిక స్థితి సరిగా లేకపోవడంతో గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై తెలిపారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ పేర్కొన్నారు.

## దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు పాటుపడాలి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ సాయుధ పోరాటంలో వీరమరణం పొందిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం దొడ్డి కొమురయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నిజాం పాలన సమయంలో నల్గొండ జిల్లాలో భాగంగా ఉన్న కడివెండిలో పేదలు, సామాన్యుల బతుకులు, భూమి, పంట, పశువులు, పారే నీళ్లపైనా జనాలకు హక్కులు ఉండేవి కావనీ, పటేల్, పట్వారీల దుర్మార్గాలతో ప్రజలు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ క్రమంలో పాలకుర్తి మండలం విస్నూర్‌ను కేంద్రంగా చేసుకొని ప్రజలతో నిజాం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ దాష్టికాలకు స్వస్తి పలికేం దుకు పీడిత ప్రజలు ఎర్ర జెండా నీడలో పోరుబాట పట్టారన్నారు. 1946 జూలై 4న పొట్టలో బుల్లెట్లు దుసుకెళ్లాడంతో ఆ మహనీయుడు నేలకొరిగారని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్, ఆర్డీఓ వినోద్ కుమార్, బీసీ శాఖ అధికారి రాజాలింగు, గొల్ల కురుమలు సంఘ నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్యాక్స్‌లతో సమర్థవంతమైన కార్యకలాపాలు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్‌ల)ద్వారా సమర్థవంతమైన కార్యకలాపాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్‌తో కలిసి జిల్లా అధికారులు, నూతనంగా ఏర్పాటు అయిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను పునర్వ్యవస్థీకరించడం జరిగిందని, నూతనంగా ఏర్పడిన సంఘాల సమన్వయంతో సమర్థవంతమైన కార్యకలాపాలు నిర్వహించాలని తెలిపారు. గోదాముల నిర్వహణ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల నిర్వహణ, ఇతర సంఘ విధులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, జిల్లా సహకార అధికారి మోహన్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఆటోడ్రైవర్ల కు మౌలిక సదుపాయాలు కల్పించాలి

**బెల్లంపల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేలా కృషి చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు గురువారం బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు కట్టా రాం కుమార్ వినతి పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆటో డ్రైవర్ల సమస్యలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో వేసవితో ఎండలు తీవ్రమవుతున్నందున ఆటో డ్రైవర్లు తాగునీరు లేక సతమతమవుతున్నారని, ఆటోస్టాండ్‌ల వద్ద తాగునీరు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని, పట్టణంలో గత 30 ఏళ్ల నుండి ఆటో నడపడమే వృత్తిగా భావించి జీవనాధారంగా



కుటుంబాన్ని పోషించుకునేందుకు ఉదయం వచ్చిసాయంత్రం వరకు ఆటో నడుపుకుంటున్న ఆటో డ్రైవర్ కోసం భోజన మరియు విశ్రాంతి భవనం ఏర్పాటుకు కృషి చేయాలని,బెల్లంపల్లి పట్టణ మరియు నియోజకవర్గ ప్రాంత ప్రజలకు మరియు ఆటో డ్రైవర్ల కోసం ఆటోస్టాండ్ లపై ప్రత్యేకంగా టాయిలెట్స్‌లను ఏర్పాటు చేయాలని,ఇండ్లు లేని ఆటో డ్రైవర్లకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, రాజీవ్ యువ వికాస పథకం ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరినట్లు వివరించారు. 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు బెల్లంపల్లి పట్టణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిన్నటి వరకు ప్రత్యేకంగా విద్యార్థిని విద్యార్థులకు సేవలందించిన ఆటో డ్రైవర్లు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు యూనియన్ తరపున తెలియజేస్తున్నామన్నారు. రానున్న మరిన్ని సేవా కార్యక్రమాలు బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణం లోని సీనియర్ కౌన్సిలర్ గెల్లి రాజలింగు,బెల్లంపల్లి ఆటో యూనియన్ అధ్యక్షులు కట్ట రాం కుమార్ తోపాటు సమావేశ అధ్యక్షులు షేక్ సర్దార్ అలీ,వైస్ ప్రెసిడెంట్లు భాస్కర్, రాజ్ కుమార్ సోషల్ మీడియా ఇంచార్జ్ కిరణ్,ఆటో డ్రైవర్లు గుడిసెల వెంకటేశ్వర్లు, భరత్, శ్యామ్, రాము, రాజేందర్, కిరణ్, తుమ్మల గంగాదర్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు శుభాకాంక్షలు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్కోచ్ అవార్డు అందుకున్న సందర్భంగా అంగన్వాడి టీచర్ల సంఘం నుండి రాధ, అంగన్వాడి టీచర్లు గురువారం జిల్లా కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.



# 'బాలశక్తి'ని పకడ్బందీగా నిర్వహించాలి

**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాలశక్తి కార్యక్రమం నిర్వహణపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన పలు రకాల వైద్య పరీక్షలు, గుర్తించిన అనారోగ్య సమస్యలు, అందిస్తున్న ప్రత్యేక పోషక ఆహార వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి హెల్త్ కార్డులను రూపొందించి, ఎప్పటికప్పుడు వాటిలో విద్యార్థుల ఆరోగ్య వివరాలను నమోదు చేయాలన్నారు. పౌష్టికాహార లోపం గుర్తించిన విద్యార్థులకు ప్రత్యేక పౌష్టికాహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. వేసవి సెలవుల్లో పోషకాహారం లోపం ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారం, మందులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులందరికీ అవగాహన కలిగేలా క్షేత్ర స్థాయిలో విద్యార్థులను అవగాహనా కల్పించాలన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులచే విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాలకు విహారయాత్రలకు తీసుకువెళ్లాలని, ప్రతి పాఠశాలలో



సూచనలు, ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఈఓ పి. రామారావు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. రాజేందర్, ఎల్‌డిఎంరామ్ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.



## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి సూచించారు. పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. ఏప్రిల్ 20 నుంచి 26వ తేదీ వరకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలకు 623 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 465 మంది అభ్యాసకులు హాజరు కానున్నట్లు తెలిపారు. పదో తరగతికి మూడు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెండు పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యాసకులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 26నుంచి మే 3వరకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు వివరించారు. ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ ఎన్.అశోక్, డిప్యూటీ డీఎంహెచ్వో సాధన తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో అక్రమ అరెస్టులా



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ అన్నారు. యూనివర్సిటీ భూముల అమ్మకాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరని హెచ్సియు భూముల పరి రక్షణకు పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు. డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు నిఖిల్, తిరుపతి ఉన్నారు.

## ఆసిఫాబాద్ జిల్లాలో దంచికొట్టిన వర్షం

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ జిల్లాలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న తీవ్ర ఎండలకు బ్రేక్ పడింది. మండుటెండతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేళ వాతావరణంలో మార్పు వచ్చి కొంత ఉపశమనం కలిగించింది. తెలంగాణ, కోస్తా, మహారాష్ట్ర మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. గురువారం మధ్యాహ్నం నుంచి ఆసిఫాబాద్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఈ అకాల వర్షంతో పలు మండలాల్లో చల్లని వాతావరణం ఏర్పడింది. ఎండల వేడికి అల్లాడుతున్న రైతులకు, ప్రజలకు ఈ వర్షం ఊరటను అందించింది. భూగర్భ జలాల పెరుగుదలకు తోడ్పడనుంది. వచ్చే కొన్ని రోజుల్లో కూడా అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.

## కారులో నిద్రిస్తున్న వారిపై దాడి

### ల్యాప్టాప్, బ్యాగు చోరీ - నిజామాబాద్ జిల్లా టేక్రియాల్ వద్ద ఘటన



**ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

రోడ్డు పక్కన కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్న వారిపై దుండగులు దాడి చేసి దోపిడీకి పాల్పడిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వీరరాఘవయ్య కుమారుడు నాగమణిదీప్ హైదరాబాద్లో పదో తరగతి చదువుతున్నాడు. పరీక్షలు పూర్తి కావడంతో కుమారుడిని స్వగ్రామానికి కారులో తీసుకొస్తున్నాడు. వీరరాఘవయ్య వెంట స్నేహితుడు కూడా ఉన్నాడు. గురువారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో టేక్రియాల్ వద్ద పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న ఓ హెూటల్ ఎదుట రోడ్డు పక్కన కారు నిలిపి అందులో నిద్రించారు. నలుగురు దుండగులు కారు అద్దాలు పగలగొట్టి వారిపై దాడి చేసి కారులోని బ్యాగు, ల్యాప్టాప్ ఎత్తుకెళ్లారు. దాడిలో వీరరాఘవయ్యకు గాయాలయ్యాయి. దాడి జరిగిన వెంటనే రాఘవయ్య భయంతో కారును దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలోని సదాశివనగర్ వరకు తీసుకెళ్లాడు. అక్కడ కారును నిలిపి డయల్ 100కు సమాచారం ఇచ్చాడు. ఎస్పీ రాజేష్ చంద్ర, దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మాతా శిశు మరణాలపై అప్రమత్తంగా ఉండాలి



**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

మాతా, శిశు మరణాలు నియంత్రించడమే అమ్మరక్షిత కార్యక్రమం లక్ష్యమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అమ్మరక్షిత కార్యక్రమం అమలు తీరుపై వైద్య శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలల వారీగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నేటివరకు నమోదు చేసుకున్న గర్భిణులకు సంబధించిన వివరాలు, వారిలోని ప్రమాదకర ఆరోగ్య స్థితి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గర్భస్థ మహిళల మరణాలు తగ్గించేందుకు ప్రత్యేకంగా అమ్మరక్షిత కార్యక్రమం ప్రారంభించామన్నారు. ప్రమాదకర ఆరోగ్య స్థితిని కలిగియున్న గర్భిణులకు తగిన మందులను ఇవ్వాలన్నారు. అంగన్వాడిల ద్వారా గర్భిణులకు నాణ్యమైన పోషకాహారం అందించాలన్నారు. ఏఎన్ఎం, ఆశాలు ఎప్పటికప్పుడు గర్భిణుల ఆరోగ్య స్థితిగతులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. వైద్యులు ప్రమాదకర ఆరోగ్య స్థితిని కలిగియున్న గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, జిల్లాలో గర్భిణుల, నవజాత శిశువుల మరణాలు లేకుండా చూడాలన్నారు. డీఎంఅండ్‌హెచ్ఓ రాజేందర్, వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాస్, సురేష్, సౌమ్య, రవీందర్ లు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్నేహితుడిపై హత్యాయత్నం.. కేసు నమోదు

**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**



తన స్నేహితుడినే హత్య చేసేందుకు ఓ వ్యక్తి ఇతరులతో కలిసి యత్నించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా గురువారం వివరాలు వెల్లడించారు. స్థానిక బాలాజీవాడకు చెందిన రాజులదేవి ప్రమోద్ ఒక అమ్మాయిని ప్రేమించాడు. అదే అమ్మాయిని దినేశ్ అనే మరో వ్యక్తి కూడా ప్రేమించాడు. ఈ విషయంపై వారిద్దరి మధ్య తరుచూ గొడవలు జరిగాయి. ఈనెల 1న మరోసారి వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడికి యత్నించడంతో అక్కడే ఉన్న కోట్ల రాజేశ్ వారిని అడ్డుకుని ఇద్దరిని అక్కడి నుంచి పంపించాడు. దీంతో ప్రమోద్ తన మిత్రుడైన రాజేశ్, దినేశ్‌కు మద్దతు ఇస్తున్నాడని భావించి రాజేశ్‌పై కోపం పెంచుకున్నాడు. అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అదేరోజు అర్ధరాత్రి రాజేశ్ను రామావుబాగ్‌లోని మైసమ్మ కుంట గుట్ట ప్రాంతానికి పిలిచి గొడవపడ్డాడు. ప్రమోద్ మరో మిత్రుడైన కార్తిక్ సింగ్‌తో కలిసి రాజేష్‌పై దాడి చేశాడు. పగిలిన బీరు సీసాతో పొడిచి హత్యాయత్నం చేశారు. ఇందుకు బబ్లు అలియాస్ రాజ్‌కుమార్, సచిన్ సింగ్‌లు సహకరించారు. రాజేశ్ తల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 24 గంటల్లో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న మందమర్రి మున్సిపల్ కమిషనర్



**మందమర్రి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

పట్టణంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్నుల వసూళ్లలో 77.35% సాధించడంతో కమిషనర్, డైరెక్టర్ పురపాలక పరిపాలన శాఖ, టీకే శ్రీదేవి చేతుల మీదుగా పట్టణ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆస్తి పన్నుల వసూళ్లలో రికార్డు స్థాయిలో పన్నులు చేయడం పట్ల ఆమె ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రశంసా పత్రాన్ని అందించి సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజలింగం మాట్లాడుతూ.. పట్టణంలో అస్తి పన్నుల వసూళ్లలో 2025-26 సంవత్సరంలో 100% ఆస్తి పన్నులు వసూలు చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించి పన్నుల వసూలుకు కృషి చేస్తామన్నారు. అస్తి పన్నుల వసూళ్లలో మున్సిపల్ అధికారుల సిబ్బంది సహకారం మరువలేనిదని వారి సహకారంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కూడా మెరుగైన ఆస్తి పన్నులు వసూలు చేసేలా కృషి చేస్తామన్నారు.

## జేసీ వాహనం డ్రైవర్ మృతి

**బోథ్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**



ఆదిలాబాద్ జిల్లా జేసీ శ్యామ లాదేవి వాహనం డ్రైవర్ నూ తుల రవీందర్ రెడ్డి (కాల్వ రవి) గుండెపోటుతో మృతి చెందారు. బోథ్ మండలంలో ని ధన్నూర్ (బి) గ్రామానికి చెందిన ఆయన గత 10 సంవ త్సరాలుగా జేసీ వాహన డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్‌లో నివాసముంటున్న ఆయనకు బుధవారం రాత్రి 11 గంటల సమయంలో గుండెపోటు రావడంతో, కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. కాగా ఈసీజీ తీసే క్రమంలో ఆయన మృతిచెందారు. గురువారం ధన్నూర్ (బి)గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆ యన మృతిపట్ల జేసీ శ్యామలాదేవి సంతాపం తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

## సీసీ రోడ్డు పనుల అడ్డగింత

**చింతలమానేపల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

మండలంలోని బూరెపల్లిలో సిమెంటు రోడ్డు పనులను గురువారం అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. ఉపాధిహామీ పథకం కింద హనుమాన్ ఆలయం వరకు రూ. 5లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. మూడు రోజులుగా కొనసాగుతుండగా గురువారం డీఆర్వో హైమావతి, సెక్షన్ అధికారులు సూర్యారావు, మోహన్, సిబ్బంది అడ్డుకున్నారు. సామగ్రిని స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించారు.

# అలా పోల్చకండి ప్లీజ్....

## నటి షాలినీ పాండే వెల్లడి

బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై తనకు ఏమాత్రం నచ్చలేదని నటి షాలినీ పాండే అన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఓఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని అన్నారు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం అని షాలినీ పాండే తెలిపారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.



## వినూత్నంగా వీడియో

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం మెగా 157–వర్కింగ్ –టైటిల్ ఉగాది నాడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన విషయం తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోని ఐకానిక్ పాత్రలనూ, చిత్రబృందాన్ని పరిచయం చేస్తూ వినూత్నమైన వీడియోను మంగళవారం అనిల్ రావిపూడి విడుదల చేశారు. వీడియో ప్రారంభంలో దర్శకత్వ విభాగం సభ్యులు చిరంజీవి పంచబోయే వినోదాన్ని చూసేందుకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాస్టర్ పాటపాడుతూ ఎంట్రీ– ఇవ్వగా, చిరంజీవి 'గోదారి గట్టు–' పాట నుంచి కొన్ని లైన్లు ఆలపించి ఎంటర్‌టైన్ చేశారు. ఇలా సాంకేతిక వర్గాన్ని పరిచయం చేస్తూ సగిన వీడియ మెగా అభిమానుల్లో జోష్ నింపింది.



# రెండో సినిమా ప్రకటించిన నీహారిక

## సంగీత్ శోభన్‌తో తదుపరి చిత్రానికి రెడీ

మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల తనయ నిహారిక యాంకర్‌గా, హీరోయిన్‌గా,నిర్మాతగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటుతుంది. హీరోయిన్‌గా నిహారిక చేసిన సినిమా ఒక్కటి హిట్ కాలేదు. దాంతో నిర్మాత అవతారం ఎత్తింది. నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు సినిమా సంచలన విజయం సాధించింది. ముందుగా హీరోయిన్ గా, తర్వాత వెబ్ సిరీస్ ల్లో నటించిందికానీ చివరకు నిర్మాతగా స్థిరపడిరది. నిహారిక ఇటీవలే చిరంజీవి విశ్వంభర చిత్రంలోని ఓ పాటలో షూటింగ్ లో పాల్గొంది. ఈ పాటలో సాయిధరమ్ తేజ్ కూడా పాల్గొన్నారు. నటిగా మంచి మార్కులు దక్కించుకోలేకపోయిన నిహారిక నిర్మాతగా సత్తా చాటుతుంది. కొత్త డైరెక్టర్, కొత్త నటీనటులతో చిన్న సినిమాగా వచ్చిన కమిటీ– కుర్రోళ్లు చిత్రం 50 కోట్ల వసూళ్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమాతో పలకరించబోతుంది. తన రెండు సినిమాని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో ఫుల్ ఫామ్ లో ఉన్న నటుడు సంగీత్ శోభన్ హీరోగా నటించబోతున్నాడు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ సినిమాలతో పాటు– ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, 3 రోజెస్.. పలు సిరీస లతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న సంగీత్ ఇందులో మెయిన్ లీడ్ పోషించబోతున్నాడు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ ఇద్దరు గతంలో నిహారికతో కలిసి పని చేశారు. నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్స్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగం అయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా పని చేశారు. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో సంగత్ శోభన్ ప్రధాన పాత్ర పోషించారు. ఇక సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి మానస శర్మ దర్శకురాలిగా పని చేశారు. గతంలో ఈ ముగ్గురు కలిసి అద్భుతాలు చేయగా, ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు





# నా భర్తకు అస్సలు ఇంట్రెస్ట్ లేదు..

టాలీవుడ్ యాంకర్, స్టార్ నటి అనసూయ భరద్వాజ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన భర్త గురించి... తన కుటుంబం గురించి సీక్రెట్స్ బయటకు చెప్పి.. రచ్చ చేశారు యాంకర్ అనసూయ. తనకు ఆడబిడ్డ కావాలని... అంటుంటే ఇంట్లో మాత్రం ఎవరూ ఒప్పుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తన భర్తకు అసలు ఏమాత్రం ఇంట్రెస్ట్ లేదని ఆమె చెప్పకనే చెప్పారు. తాజాగా అనసూయ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన భర్త సుశాంక్ భరద్వాజ్, తన కుటుంబం లో జరిగే విషయాల గురించి రహస్యాలు బయటపెట్టారు అనసూయ. తన ఇంట్లో ముగ్గురు బీహార్ వాళ్లు ఉన్నారని... అన్ని మీసాలు గడ్డాలు తప్ప ఆడవాళ్లు మాత్రం లేరని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఇంట్లో ఆడపిల్ల ఉండాలని... తనకు కూడా ఆడపిల్ల కావాలని ఉందని పేర్కొన్నారు అనసూయ. కానీ ఇంట్లో తన ఆటలు సాగడం లేదని వివరించారు. ఆడపిల్లను కనడం తన చిన్న కొడుకుకు కూడా ఇష్టం లేదని వ్యాఖ్యానించారు అనసూయ. ఇక.. తమ ఇంట్లో ఎక్కువ శాతం బిహారీ పద్ధతులు కొనసాగుతాయని ఆమె వివరించారు. ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకునే వరకు తమ లైఫ్ ఫుల్ బిజీగా ఉంటుందని ఆమె చెప్పుకొచ్చారు. ఫుల్ టైం నటిగా మారిపోయిన తర్వాత... పిల్లలతో గడిపే అవకాశం ఉండడం లేదని చెప్పుకొచ్చారు. దీంతో అనసూయ చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్‌గా మారాయి.

# అద్భుత చిత్రరాజం.. ఆదిత్య 369

అప్పట్లో ఆదిత్య–369 అద్భుత విజయం సాధించింది. అంతేకాదు మంచి సినిమాగా నిలిచింది. దర్శకుడు సింగీతం ఖాతాలో హిట్ పడిరది. ఆయన ప్రతిభన్ మరోమరా చాటింది. ఈ సినిమా గురించి ... ఇదేం నేపథ్యంఅని అప్పట్లో చాలామంది సందేహించారు. సినిమా విడుదలై, ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయారు. దాదాపు 34 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ సినిమా అధునాతన సాంకేతిక విలువలతో ఈ నెల 4న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు నాటి విశేషాలు పంచుకున్నారు. హాలీవుడ్ మూవీ 'బ్యాక్ టు– ది ఫ్యూచర్' స్ఫూర్తితో 'ఆదిత్య 369' తీశానని అనడాన్ని తిప్పికొట్టారు. ది టైమ్ మిషన్' నవలను తాను కాలేజీ రోజుల్లోనే చదివానని, అందులోని ఆసక్తికర అంశాల గురించి స్నేహితులతో చర్చించేవాడిని. డైరెక్టర్‌ని అయిన తర్వాత ఆ కాన్సెప్టుతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. ఓ సారి విమాన ప్రయాణం చేస్తుండగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో నా ఆలోచన చెప్పా. ఎంతో ఉత్సాహం చూపిన ఆయన 'ఐడియా బాగుంది. తప్పకుండా చేద్దాం' అని అన్నారు. ఇద్దరు ముగ్గురు ప్రముఖ నిర్మాతలకు ఆయనే ఈ కథ వినిపించారు. కానీ, వారికి సైన్స్ ఫిక్షన్ కాన్సెప్టు అర్థం కాలేదు. ఇదేదో ఫాంటసీ సినిమా అనుకున్నారు. కథపై నమ్మకం ఉన్న ఎస్పీబీ పట్టు వదలకుండా.. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌ను సంప్రదించారు. ఆయనకు బాగా నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. హీరో పాత్రకు ముందు నుంచీ బాలకృష్ణనే అనుకున్నాం. స్టోరీ విన్న వెంటనే ఆయన నటించేందుకు అంగీకరించారు. హీరోయిన్‌గా విజయశాంతి బాగుంటుందని కృష్ణప్రసాద్, బాలకృష్ణ అనుకున్నారు. డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో ఆమె నటించలేకపోయారు. ఓ దర్శకుడు మోహిని గురించి చెప్పగా.. ఆడిషన్ చేసి కథానాయికగా ఆమెను ఎంపిక చేశాం. బాలీవుడ్ నటుడు టీనూఆనంద్‌ను ప్రొఫెసర్ పాత్రకు తీసుకున్నామని అన్నారు. టైటిల్ విషయంలో కృష్ణప్రసాద్ ఏమైనా అనుకుని ఉండొచ్చుగానీ నేను ముందు నుంచీ 'ఆదిత్య' పేరునే ఫిక్స్ అయ్యా. అలా 'ఆదిత్య 369' అయిందని సింగీతం వివరించారు.



# రాజ్యాంగ రక్షణకు పాటుపడాలి



మాజీమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

**ముథోల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో మాజీమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి బాపూజీ చిత్రపటానికి, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగాన్ని రక్షించుకుందామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కరపత్రాలను పంపిణీ చేసి రాజ్యాంగ పీఠిక ప్రదర్శన చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఈ దేశంలో బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతిగా అభివర్ణిస్తూ.. రాజ్యాంగాన్ని కాపాడాలని రాజ్యాంగ విలువలను కాపాడాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్క ర్ స్ఫూర్తిని, మహాత్మాగాంధీ ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లాలని, ఈ దేశంలో భవిష్యత్ తరాలకు ముప్పు వాటిల్లుతోంది అని అది నిర్మూలించడానికి కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జైబాబు జైభీమ్ జైసంవిధాన్ అభియాన్ యాత్రను గురువారం నిర్మల్ నియోజకవర్గంలో జరుపుకోవడం జరిగిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గా లకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ యాత్ర ముందుకు సాగుతుందన్నారు. వీరితో పటు నాయకులు పాలుగోన్నారు. యాత్రలో ఇంద్రకరణ్ రెడ్డితోపాటు రాజారాం సత్యం తాజా మాజీ మునిసిపల్ చైర్మన్ ఖానాపూ ర్, నాదేడపు చిన్ను నిర్మల్ టౌన్ అధ్యక్షుడు, జూనైడ్ మేమూన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు, ముడుసు సత్యనారాయణ ఎస్సీ సెల్, ధర్మాజీ రాజేందర్ ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్, రామలింగం, వాజిత్ ఖాన్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, రమణ రెడ్డి పీఎసీఎస్ చైర్మన్, రఘు మాజీ కౌన్సిలర్, పాకాల రాంచేందర్, గజేందర్ మాజీ కౌన్సిలర్, నాగశాలి రాజేందర్ మాజీ కౌన్సిలర్లు, రామకృష్ణ, అన్వార్ తదితరులు పాల్గొన్నారు.

## బాసర ఆర్జీయూకేటీలో
# న్యాక్ సన్నాహక సమావేశం



**ముథోల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

ఆర్జీయూకేటీలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏసీ) మూల్యాంకనానికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని ఇన్చార్జి వీసీ గోవర్ధన్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశానికి ఓఎస్ఓ, ఏవో,అసోసియేట్ డీన్లు, అధ్యాపకులు హాజరయ్యారు. ఇన్చార్జి వీసీ మాట్లాడుతూ న్యాక్ అక్రిడిటేషన్ ప్రక్రియ నిర్ధారించడానికి అధ్యాపకులు పూర్తివివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు. యూనివర్శిటీ అకడమిక్, పరిపాలన, మౌలిక సదుపాయాల ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అధ్యాపకులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. ఆర్జీయూకేటీ విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించేందుకు, ప్రణాళికబద్ధంగా ఈ ఎన్ఏసీ మూల్యాంకన ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని వివరించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి పలు నూతన కోర్సులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్శన్, ఏవో రణధీర్, అసోసియేటెడ్ విటల్, మహేశ్, చంద్రశేఖర్, హెచ్ వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను అరికడతాం

- గంజాయి, మాదకద్రవ్యాలను అరికట్టేందుకు గంజాయి స్మగర్లపై నిరంతరం నిఘా..
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

అసాంఘిక చర్యలను అరికడతా మని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. గురువా రం పోలీస్ హెడా క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యా ప్తంగా నమోదైన కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి స్మగ్లర్లపై నిఘా ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. త్వరలో ప్రారంభించనున్న 'పోలీస్ మీకోసం' కార్యక్రమాన్ని ప్రతీవారం ఒక్కో గ్రామంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్ గ్రేవ్ కేసులు, నాన్ గ్రేవ్ కేసులు, పోక్సో, ఇన్వెస్టిగేషన్ కేసులపై విచారణ జరిపి అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. కోర్టు డ్యూటీ అధికారి విధులను పర్యవేక్షిస్తూ పెండింగ్ కేసుల వివరాలు ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు. సాక్షులను కోర్టులో హాజరుపర్చి నిందితులకు శిక్ష పడేలా చూడాలని పేర్కొన్నారు. రాత్రి వేళ అనుమానాస్పదంగా తిరిగే



వ్యక్తుల వేలిముద్రలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని ఆయన సూచించారు. సమీక్షా సమావేశంలో డీఎ స్పీలు జీవన్రెడ్డి, నాగేందర్, సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్, శ్రీనివాస్, ప్రణయ్ కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

## కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం



**ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

అకాల వర్షాల వల్ల ఉత్పన్నమైన పరిస్థితులను ఎదుర్కొనడానికి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆయా జిల్లా కలెక్టర్‌లను అధికారులను ఆదేశించారు. భారీ వర్షంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ఈదురుగాలుల కారణంగా తలెత్తిన పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ సహాయక చర్యల కోసం అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రదేశాల్లో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, విద్యుత్ అంతరాయాలు లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో వెంటనే సమస్యను పరిష్కరించి సరఫరాను పునరుద్ధరించాలన్నారు.

జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అన్నారు. పోలీసులు క్షేత్రస్థాయిలో ఉండి ట్రాఫిక్ సమస్యను ఎక్కడికక్కడ పరిష్కరించాలని చెప్పారు. వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లు పడుతున్నందున జిల్లా కలెక్టర్లు, పోలీసు యంత్రాంగం, ఇతర అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## కేంద్ర మంత్రులను కలిసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా
# బీజేపీ ప్రజాప్రతినిధులు

- జాతీయ రహదారులను అభివృద్ధి చేయండి
- బాసర-మాహూర్ రహదారికి నిధులు మంజూరు చేయండి
- బాసర వంతెనపై రక్షణ కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీకి విన్నవించిన ఎమ్మెల్యేలు, ఎంపీ



**ముథోల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

కేంద్ర మంత్రులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీజేపీ ప్రజా ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు. అదిలాబాద్ ఎంపీ నగేష్, నిర్మల్, సిర్పూర్, అదిలాబాద్, ముధోల్ ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, పాల్వాయి హరీష్ బాబు, పాయల్ శంకర్, పవర్ రామారావు పటేల్ వారి వారి నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను మంత్రులు నితిన్ గడ్కారీ, రామ్మోహన్ నాయుడులకు వివరించారు. బాసర-మాహుర్ జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ కేంద్రమంత్రి నితిన్ గడ్కారీను విన్నవించారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో బాసర నుండి మాహుర్‌కు జాతీయ రహదారికీ అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు పంపాలని కోరిన విషయం విధితమే. అందులో భాగంగా జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ముధోల్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి పెద్ద మొత్తంలో సిఐఆర్ఎఫ్ నిధులు కేటాయించాలన్నారు. అదేవిధంగా బాసర వంతెన ఆత్మహత్యలకు నిలయంగా మారిన తరుణంలో నిధులు కేటాయించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరారు. అదిలాబాద్‌లో నూతనంగా ఎయిర్ పోర్ట్ మంజూరు చేయడంతో రామ్మోహన్ నాయుడును శాలువాతో సత్కరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి నితిన్ గడ్కారీకి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిచినట్లు ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, తెలిపారు.